www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 31 జనవరి 2024

5



కోనసీమ

అర్తమూరులో పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

అర్తమూరు గ్రామంలో ఎంపిపి పాఠశాల నిర్మాణ పనులను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు గ్రామ సర్పంచ్ గొలుగురి అన్నపూర్ణ, విజయ భాస్కర్ రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యం దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, సిహెచ్‌వి.సోమిరెడ్డి, హెచ్‌ఎం బి.కుసుమ, అర్తమూరు, ఎఎమ్ఒ పి.రాంబాబు, సిఆర్‌పినారాయణరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


సమీక్షిస్తున్న ఎపిసి తదితరులు

కౌలు రైతుకు మిగిలేది కష్టమే..

- ఏటా పెరుగుతున్న పెట్టుబడి
- విత్తనాలు, ఎరువుల ధరలు రెట్టింపు
- సకాలంలో అందని రుణాలు


దుక్కు దున్నుతున్న రైతు

ప్రజాశక్తి - రాజోలు

దాళ్వా సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. వరి సాగు చేసే రైతులకు వాతావరణం అనుకూలంగా ఉంది. ఇంత వరకూ బాగున్నా.. పెట్టుబడుల విషయానికొచ్చేసరికి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతంతో పోల్చితే అన్ని ధరలూ పెరిగి పోవడంతో రైతులు వ్యవసాయం చేసేందుకు భయపడుతున్నారు. రెండేళ్లకీ ఇప్పటికీ పెట్టుబడుల్లో భారీ వ్యత్యాసం రావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం కొన్న అవే రకం ఎరువులు, విత్తనాలు ధరలు ఆకాశాన్నంటాయి. కూలి రేట్లు అమాంతం పెరిగిపోవడంతో రైతు వ్యవసాయం చేసేందుకు వెనుకడుగు వేస్తున్నాడు. ఇంత ఖర్చు పెట్టి పొలంలో దిగితే సాగు చేసిన నాటి నుండి ఫల సాయం చేతికి అందే వరకు రైతుకు కంటి నిండా కునుకు ఉండదు. రూ.వేలల్లో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో చీడ పీడలు, ప్రకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోయిన రైతులు ఎంతో మంది ఉన్నారు. జిల్లాలో ఆయకట్టు దిగువన ఉన్న సముద్ర తీరంలోనే కాక ఎగువన ఉన్న బ్యారేజ్ సమీపంలోని పంట పొలాలు సైతం ముంపు బారిన పడుతున్నాయి. దీనివల్ల దాళ్వా సాగు రైతులకు జూదంగా మారిపోయింది. ఈ ఏడాది జిల్లాలో 1,83,000 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోందని అంచనా.

రెట్టింపైన పెట్టుబడులు

గడిచిన రెండేళ్లతో పోలిస్తే వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపయ్యాయి. డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో వ్యవసాయ రంగంపై దీని ప్రభావం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. రెండేళ్ల క్రితం ఒక ఎకరం పొలంలో వరిసాగు చెయ్యాలంటే రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు పెట్టుబడులు పెట్టేవారు. ప్రస్తుతం ఎరువుల ధరలు, ట్రాక్టర్ అద్దెలు, పురుగు మందులు ధరలు, కూలీలకు ఇచ్చే కూలిరేట్లు పెరగడం వల్ల ఒక ఎకరా వరిసాగుకు రూ.29 వేల నుంచి రూ.30 వేల వరకూ వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో ట్రాక్టర్ గంట సేపు దున్నడానికి రూ.800 తీసుకునేవారు. ప్రస్తుతం డీజిల్ రేట్లు పెరగడంతో గంటకు రూ.1100 నుండి రూ.1200 తీసుకొంటున్నారు. రెండేళ్ల క్రితం కంటే ఇప్పుడు డిఎపి, గ్రోమోర్ 28-28-0, పొటాష్ వంటి ఎరువులపై ఒక్క బస్తాకు రూ.200 నుండి రూ.300 వరకు పెరగడంతో పాటు కూలీల రేట్లు పెరగడంతో పెట్టుబడులు అధికమవుతున్నాయి. ఎకరం పొలంలో వరి పంట బాగా పండితే 22 క్వింటాలు ధాన్యం దిగు బడులు వస్తాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు మిల్లర్లు ధాన్యం గ్రేడింగ్ నిర్ణయించి ధర నిర్ణయిస్తారు.

కౌలు రైతులకు మిగిలేదేమిటి..?

ఇక జిల్లాలో 75 శాతం మంది కౌలు రైతులే వాస్తవ సాగుదారులుగా ఉన్నారు. ఇప్పుడు పెరిగిన ధరలు వారిని ఆందోళనకు గురి చేస్తున్నాయి. పంట పండించినా మిగిలేది ఏమీ కనబడటం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. కౌలు రైతులు పంటకు సరాసరిన 15 బస్తాలు కౌలు కింద ఇవ్వాల్సి వస్తుంది. దిగుబడులు ఆశాజనకంగా లేక పోవడంతో కౌలు ఖర్చులు తీసివేస్తే ఎకరాకు వచ్చే ఆదాయం 21 నుంచి 28 వేల రూపాయలు వరకు మాత్రమే ఉండగా పెట్టుబడులు మాత్రం రూ.35 వేల వరకు అవుతోందనే భావన కౌలు రైతుల్లో కనిపిస్తోంది.

సాగు ఖర్చులు ఎకరాకు రూ.80 వేల పైనే

ఒక ఎకరా సాగు చేసేందుకు సార్వాకు దాదాపు రూ.38,700 దాకా ఖర్చులు అవుతాయి. దాళ్వాకు రూ.10 అదనంగా ఖర్చవుతోంది. ఆకుమడి, విత్తనాలు, ఎరువులకు రూ.1500, దమ్ముకి రూ.3600, లంకల బాగుచేతకి రూ.1000, ఊడ్పులు, ఆకుతీతకు రూ.4700, కలుపుమందు చల్లినందుకు కూలీ రూ.1200, కలుపుతీతకు, గడ్డికోతకి రూ.1000, ఎరువులు రెండు ధపాలకు రూ.5000, చిరు పొట్ట దశల్లో పొటాష్, గుళికలకు రూ.1200, పురుగుమందు స్ప్రేయర్లు, నాలుగుసార్లకు రూ.11 వేలు, ఎలుకల నివారణకు రూ.500, కోతమిషన్, ట్రాక్టర్‌కు రూ.6 వేలు, ధాన్యం ఆరబోత, పట్టుబడికి రూ.2 వేలతో కలిపి 38,700 అవుతుందని జిల్లా కౌలు రైతు సంఘాలు అంచనా వేశాయి. రెండు పంటలకు కలిపి మొత్తం రూ.87,400 వరకు ఖర్చులు అవుతాయని అంచనా వేశారు. ఇక కౌలు రెండు పంటలకు మెట్ట ప్రాంతంలో రూ.35 వేలు వరకు, డెల్టా ప్రాంతంలో ఇంకా ఎక్కువగా ఉంటుంది. పంట పొలాలలో దమ్ము చేసిన అనంతరం పొలాన్ని చదును చేసే ఖర్చులు కూడా పెరిగాయి. నారు వేసేందుకు, తీసేందుకు అయ్యే ఖర్చులు కూడా పెరిగాయి. ఇలా ఖర్చులు పెరుగుతున్నా వీటికి తగ్గట్టుగా పంటలకు గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఉండటంతో ఆదాయం అంతంత మాత్రంగానే లభిస్తోంది. వరి కోత మిషన్‌కు గతేడాది గంటకు రూ.2300 ఉండగా ఇప్పుడు రూ.3300 చేరింది.

నేటి నుంచి జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియం నందు జిల్లా స్థాయిలో ఆడదాం ఆంధ్రా టోర్నమెంట్ 31 జనవరి నుంచి 4 ఫిబ్రవరి 2024 వరకు టోర్నమెంట్ శాంతి యుత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో అధికారులకు సూచించారు. ఈ క్రీడల నిర్వహణ నిమిత్తం కొంత మంది అధికారులకు విధులు బాధ్యతలు కేటాయించారన్నారు. జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించాలన్నారు. 15 ఏళ్ల పైబడిన పురుషులు స్త్రీల కోసం విడి విడిగా ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ప్రభుత్వం తెలియ జేసిన షెడ్యూల్ ప్రకారం జిఎంసి బాలయోగి స్టేడియంలో 31 జనవరి నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఆడుదాం ఆంధ్రా నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో జిఎంసి బాలయోగి స్టేడియం నందు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ఓవరాల్ ఇన్చార్జిలుగా స్థానిక ఆర్‌డిఒ, జిల్లా చేనేత జౌళి శాఖ ఎడి వ్యవహరిస్తారన్నారు. జిల్లా స్థాయిలో క్రీడాకారులకు, అధికారులకు తాగునీరు, భోజన ఏర్పాట్లు డిఎల్‌డిఒ అమలాపురం వారు చేపడతారన్నారు. వేదికల వద్ద పారిశుధ్య పనుల ఏర్పాట్లు మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి చేపడతారన్నారు. క్రీడాకారులకు రవాణా ఏర్పాట్లు గ్రామ వార్డు నోడల్ అధికారి, జిల్లా రవాణా అధికారి సమ న్వయంతో చేపడతారన్నారు. క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు పై జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, బిసి వెల్ఫేర్ అధికారి సమన్వయం వహిస్తారన్నారు. వేదిక వద్ద వైద్య బందాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏర్పాటు చేయాలని సూచించారు. వేదిక వద్ద శాంతి భద్రతల పరిరక్షణకు క్రీడాంశాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పోలీస్ సిబ్బందిని నియమించాలన్నారు. ఆన్లైన్ క్రీడాం శాల స్కోరింగ్ అప్డేట్, ఫలితాలు వెల్లడికి అల్లవరం ఎంపిడిఒ అల్లవరం సమన్వయం వహిస్తారన్నారు. జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు ప్రారంభం, ముగింపు కార్యక్ర మాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పర్యవేక్షించాలన్నారు.

'సేంద్రియ' పద్ధతులతో తెగుళ్ల నివారణ


పంటపొలాలను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి తెగుళ్లను నివారించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా. భవాని, డా. పిబి.కుమార్ సూచించారు. మండలంలోని అయినాపురం, రాజుపాలెం మరియు ముమ్మిడివరం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అధికారి ఎస్.ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యం లో పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్శనలో శ్రీ ధతి ఎంటియు 1121 రకం విత్తన వరి, నాట్లు వేసిన పంట పొలాల్లో జింక్ లోపం, కాండం తొలిచే పురుగును, అకుమడత మరియు కలుపు సమస్య అధికంగా ఉన్నట్లు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా.భవాని మరియు డా. పిబి.కుమార్ లు గుర్తించారు. వీటి నివారణకు రైతులు జింక్ సల్ఫేట్ 2గ్రాములు లీటర్ నీటిలో కలిపి నారు మడి దశలోనూ, నాట్లు వేసే దశలోనూ 4-5 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయడం, అలాగే 15- 20 రోజుల వ్యవధిలో కాండం తొలచే పురుగు ఆశించినట్లైతే కార్బోప్యూరాన్ 3 గ్రాములు 10 లీటర్ల నీటిలో లేదా పిప్రోనిల్ 0.3గ్రాము 8 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా జింక్ లోప నివారణకు తోడ్పడు తుందని రైతులకు వివరించారు. వీరి వెంట జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.రాజశేఖర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.


సర్పంచ్ రాంబాబు, ఎంఇఒ సాలెంరాజుకు సన్మానం

సేవా పురస్కార గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - ఆలమూరు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల విద్యాశాఖ అధికారి పి.సాలెం రాజు, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఉత్తమ పురస్కార అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని గుమ్మిలేరు ఎంపిపి యుపి స్కూల్లో సన్మానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ప్రైమరీ తరగతుల ఉపాధ్యాయుడు కోటిపల్లి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ రాంబాబుకి ఉత్తమ పురస్కార అవార్డు దక్కడం అభినందనీయమని అన్నారు. మండల విద్యాశాఖధికారి సాలెం రాజుకి జిల్లాస్థాయిలో ఉత్తమ పురస్కార అవార్డు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. విద్యాభివృద్ధికి పాటుపడుతూ, మెరుగైన విద్యా విధానాలతో సేవలందిస్తున్నారని అన్నారు. అలాగే విద్యార్థులలో టాలెంట్ గుర్తించి వారికి ప్రోత్సాహకాలు , ఐడెంటి కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రథమ ఉపాధ్యాయురాలు కెవిబిఎల్.పద్మావతి, ఉపాధ్యాయులు శైలజ రాణి, కనకదుర్గ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి సన్మానం


రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న విఆర్‌ఒలు

ప్రజాశక్తి-రామచంద్రపురం


రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ గా సేవలందించిన శ్రీకాంత్ రెడ్డి గుడివాడకు బదిలీ అయ్యారు . ఆయనకు వీడ్కోలు పలుకుతూ పట్టణ విఆర్‌ఒలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విఆర్‌ఒల సంఘం నాయ కులు మద్దాల బాపూజీ మాట్లాడుతూ 10 శాఖల కు చెందిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని అందులో ముఖ్యంగా రెవెన్యూ శాఖ చెందిన విఆర్‌ఒల విధుల పట్ల వివక్షకు తావు లేకుండా శ్రీకాంత్ రెడ్డి ఎంతో సహకరించారని కొనియాడారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ సంఘం ఉపాధ్యక్షులు పి. సాయి ప్రతిమ, పట్టణ అధ్యక్షులు ఎన్.శేఖర్, కార్యదర్శి సత్యవతి, గౌరవ అధ్యక్షులు చీకట్ల వీరాంజనేయులు, ఉపాధ్యక్షులు ఎన్ సత్యనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి చిక్కాల మానస, కోశాధికారి సీతా మహాలక్ష్మితో పాటు కనకదుర్గ, నర్మదా, శిరీషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు

ప్రజాశక్తి-మామిడికుదురు

గ్రామ స్థాయి లో ప్రజలకు మెరుగైయిన సేవలు అందించెందుకు సిఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టారని ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబు, జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ అన్నారు. పాశర్లపూడి లో మంగళవారం రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఎంఎల్ఎ, జెడ్‌పి ఛైర్మన్ ప్రారంబించారు. ఈ కార్యక్రమం లో ఎంపిపి కుసుమ వనజ కుమారి, జెడ్‌పిటిసి సభ్యులు కె.అంజిబాబు, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, నాగరాజు, ఎంపిటిసి సభ్యులు నెల్లి దుర్గాప్రసాద్, అంకాని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సర్పంచుల దీక్ష


అమలాపురంలో నిరసన దీక్ష చేస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి-అమలాపురం

సర్పంచులకు ప్రధాన డిమాండ్లుగా ఉన్న 16 అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్స్ ఆఫ్ సర్పంచుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో అమలాపురం గడియారం సెంటర్లో మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రంబాల రాంబాబు, నాగ బత్తుల శాంత కుమారి, మూడు జిల్లాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ లు పరమట శ్యాం కుమార్, పెద్దిరెడ్డి రాము, చిక్కం పెదబాబు, జాలెం సుబ్బారావు, నక్క కృష్ణవేణి, పోతుకుర్రు సత్తిబాబు రాజు, సర్పంచ్ ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు 'రెడ్ క్రాస్' సాయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అగ్ని ప్రమాదబాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సంస్థ మంగళవారం సాయం అందజేసింది. అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్గి ప్రమాదానికి బొలిశెట్టి వీరబాబు కుటుంబం సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు.

జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) సూచనలతో రెడ్ క్రాస్ వైస్ ట్రెజరర్ జల్లి సుజాత, గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్ర రావు, వైస్ ఎంపిపి పొలమూరి బాలకృష్ణ చేతుల మీదుగా మంగళవారం బాధిత కుటంబానికి టార్పాలిన్, వంట సామగ్రి, హైజిని కిట్, కిరాణా సరుకులు, కూర గాయలు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు బాలరాజు, ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్న ప్రసాద్,గ్రామ పెద్దలు సుబ్రహ్మణ్యం, సాయిబాబు, ప్రసాద్, శ్రీరామ్ మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సహాయం అందజేస్తున్న వైస్ ఎంపిపి బాలకృష్ణ

మహాసభల జయప్రదానికి పిలుపు


వెంకటాయపాలెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎఐకెఎంఎస్ నాయకులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఫిబ్రవరి 3,4 తేదీల్లో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం 10వ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐకెఎంఎస్ నాయకులు పిలుపునిచ్చారు. వెంకటాయపాలెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం 10 వ మహాసభల పోస్టర్‌ను మంగళ వారం ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా నాయకులు వి.భీమాశంకరం మాట్లాడుతూ నేడు దేశంలో వ్యవసాయ రంగాన్ని మోడీ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందన్నారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. ఈ విషయాలపై మహాసభలో చర్చలు జరుగుతున్నాయని. మోడీ ప్రభుత్వం నామమాత్రంగా వున్న భూ సంస్క రణలను సైతం భూస్థాపితం చేసిందని ఆరోపించారు. ఆదివాసీలను అడవులు నుంచి గెంటి వేయడానికి నూతన అటవీ హక్కుల చట్టాన్ని తెచ్చిందనిఆ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 10వ రాష్ట్ర మహాసభలు ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాల్లో నిర్వస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ నాయకులు ఎ.కృష్ణ, సిహెచ్. రాజా రెడ్డి, పిడిఎస్‌యు నాయకులు బి. సిద్ధూ, టి. లక్ష్మణ్, గ్రామ రైతు కూలీ నాయకులు డి.శ్రీను, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఐఆర్ఆర్'పై సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

ప్రజాశక్తి-కొత్తపేట

టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమంగా పెట్టిన ఇన్నర్ రింగు రోడ్డు(ఐఆర్‌ఆర్) కేసుపై సుప్రీంకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం టిడిపి కార్యాలయంలో సత్యానందరావు మాట్లాడుతూ చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసు కొట్టివేయడం శుభపరిణామమన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేయాలనే ఆలోచనే తప్ప వాస్తవంగా ఇన్నర్ రింగ్ రోడ్డులో ఏ తప్పు జరగలేదన్నారు. అందుకే గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కంఠం శెట్టి శ్రీనివాసరావు కముజు వర ప్రసాద్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'




గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అమలాపురం అహింసా, సత్యా గ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి జెసి తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె. కాశీ విశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు పి సుబ్రహ్మణ్యం, జల వనరుల శాఖ డిఇ శ్రీనివాసరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** స్థానిక ఇందుపల్లి ఏ వన్ కన్వెన్షన్ హాల్ నందు మంత్రి పినిపే విశ్వరూప్ ప్రజాప్రతి నిధులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకు రావడం జరిగిందన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా షెటిల్ టోర్నమెంట్లో విజేతగా నిలిచిన 8వ వార్డుకు చెందిన ఆర్.మాధురిని మెమెంటోతో మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, కుడిపూడి సూర్యనారాయణ రావు, పురపాలక సంఘ చైర్పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పురపాలక సంఘ వైస్ ఛైర్మన్ నాని రాజు, సంసాన్ నాని తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం(అల్లవరం)** కొమరగిరిపట్నం గ్రామ పంచాయతీలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి , పంచాయితీ కార్యదర్శి ఎన్ వి వి సత్యనారాయణ సమక్షంలో గాంధీ చిత్రా పటానికి పూల దండలు వేసి నివాళి అర్పించారు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **మండపేట** స్థానిక సంగమేశ్వర కాలనీలోని ఎంపిపి పాఠశాల్లో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ముత్యాల మాణిక్యాంబ, ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **మామిడికుదురు** సెంటర్ లో కాంగ్రెస్, జనసేన నేతలు మహాత్మా గాంధీ విగ్రహనికి వేరు వేరు గా పూలమాలలు వేచి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ నేతలు అప్పన శ్రీ రామకష్ణ, గె డ్డం వెంకటేశ్వరరావు, బత్తుల సురే స్ బాబు, ఎన్ బాల సత్యనారాయణ, మరియు జనసే న నాయకులు యింటి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మండపం ప్రాంగణంలో వాసవి క్లబ్ ఎస్ ఎస్ ఎస్ విజయం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో అధ్యక్షులు పట్నాల నాగరాజు, కార్యదర్శి వెచ్చా నాగ వెంకట సుబ్రహ్మణ్యం, కోశాధికారి శ్రీకాకుళపు సత్యనారాయణ, జోన్ ఛైర్మన్ పేరూరి నాగేశ్వరరావు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, పిహెచ్‌సిలు, గ్రంథాలయాల వద్ద గాంధీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. **కొత్తపేట** గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని కొత్తపేట పంచాయతీ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం ఎంపీ చింత అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆముడా ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్రాజు, ఎంపిపి ఎమ్.గంగాధర్, జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట విద్యా బాల మందిర్ స్కూల్లో జరిగిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.అనురాధ, ప్రధానోపాధ్యాయులు నూకపేయి శివరత్నం తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో గాంధీవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ చింతా అనురాధ, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి


ఇందుపల్లి లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగిన వివాహిత మృతి

ప్రజాశక్తి-కొత్తపేట

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత పరిస్థితి విషమించడంతో మృతి చెందినది కొత్తపేట ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు. మండలంలోని మోడేకుర్రు గ్రామ శివారు గొలకోటివారిపాలానికి చెందిన గొలకోటి హేమభద్ర "రావుతో సత్యవేణికి ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. కొంతకాలంగా సత్యవేణి కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈనెల 24న కడుపు నొప్పిని తాళలేక పురుగుల మందు తాగింది. స్థానికులు వెంటనే ఆమె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 29న పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి చవాకుల సూర్యావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సారాను తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఎస్ఇబి, పోలీసులు సంయుక్తంగా మంగళవారం మండలంలోని లంక గ్రామాల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెలిచేరు, ఆత్రేయపురం శివారు కుమ్మరిగుంటలో సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కొత్తపేట కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ బివి.కిరణ్ కుమార్ తెలిపారు.

ఉద్యోగిపై దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

మత్స్యశాఖ సహాయకుడు పరుశురాంపై వైసిపి నాయకుడు రావు చిన్నారావు, వైసిపి కార్యకర్తలు దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు పరుశురాం పై సోమవారం ఉన్నతాధికారుల సమక్షంలోనే వైసిపి నాయకుడు రావు చిన్నారావు, ఆయన అనుచరులు దాడి చేసిన సంఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. దీనిపై బాధితుడితోపాటు, మత్స్య శాఖ ఉన్నతాధికారి సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు వారిచ్చిన ఫిర్యాదును తీసుకునేందుకు సిద్ధపడలేదు. కేసు పెట్టకుండా బాధితుడిపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. సోమవారం రాత్రి దాడికి పాల్పడిన రావు చిన్నారావు బాధితుడికి క్షమాపణ చెప్పినట్టు ప్రచారం జరిగింది. అయితే మంగళవారం ఉద్యోగ సంఘ నాయకులతో బాధితుడు పరుశురామ్ స్టేషన్కు వచ్చి రొయ్యల చెరువులకు రాయితీ ఇవ్వలేదన్న అక్కసుతో తనపై వైసిపి నాయకుడు రావు చిన్నారావు, ఆయన అనుచరులు దుర్భాషలాడుతూ దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. ప్రాథమిక విచారణ అనంతరం ఎస్ఐ స్వామి నాయుడు కేసు నమోదు చేశారు.

స్టేషన్లో లొంగిపోయిన గంజాయి కేసు నిందితుడు

ప్రజాశక్తి - గండేపల్లి

గంజాయి కేసులో నిందితుడు స్థానిక పోలీస్స్టేషన్లో లొంగిపోయాడు. ఈ నెల 22న పాడేరు ప్రాంతం నుంచి గుంటూరుకు గంజాయిని రవాణా చేస్తూ గండేపల్లి శివారులో పోలీసులు తనిఖీల్లో 'షేక్ బాజీబాబా' అనే వ్యక్తి దొరికిపోయాడు. ఈ రవాణాలో మరో ముద్దాయి అయిన గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామానికి చెందిన ముక్కాల ప్రకాశరావు తప్పించుకుని పారిపోయాడు. అయితే మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆ ముద్దాయి గండేపల్లి పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. జగ్గంపేట సిఐ లక్ష్మణరావు, ఎస్ఐ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆ ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కబడ్డీ విజేత చిక్కాల సచివాలయం జట్టు

చాగల్లు : నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీల్లో చిక్కాల సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. ఖోఖోలో తృతీయ స్థానం పొందింది. క్రీడాకారులకు సర్పంచ్ కొయ్యమణి, సొసైటీ చైర్మన్ సుంకర రాయుడు మెడల్స్, ట్రోఫీని అందజేశారు. క్రీడాకారులకు సొసైటీ అధ్యక్షులు సుంకర రాయుడు నగదు ప్రోత్సాహం అందజేశారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు పురస్కరించుకుని జిల్లాలో పలుచోట్ల అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. వ్యాధి గ్రస్తులకు రొట్టెలు దుప్పట్లు అందజేశారు.

కపిలేశ్వరపురం మండలంలోని అచ్యుతాపురం పిహెచ్సి పరిధిలోని కాలేరు గ్రామ సచివాలయం వద్ద డిఎంహెచ్ ఒ ఎం.దుర్గారావు దొర పర్యవేక్షణలో మంగళవారం కుష్టు వ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దాయం కావేరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఎంహెచ్ఒ పాల్గొని మాట్లాడారు. పిహెచ్సి పరిధిలో ప్రతీ కుటుంబాలను కలిసి కుష్టువ్యాధి పై అవగాహన కల్పించాలని ఎఎన్ఎమ్లకు, ఆశా వర్కర్లు కు సూచించారు. ప్రాథమిక దశలో కుష్టు వ్యాధిని గుర్తిస్తే మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా పూర్తిగా నివారించవచ్చన్నారు. కుష్టి వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం కలిగే ప్రమాదం ఉందని వ్యాధిగ్రస్తులకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ దుర్గారావుదొర మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామసభలు ఏర్పాటు చేసి కుష్టు వ్యాధి పట్ల అవగాహన కల్పించాలన్నారు. ముందుగా డిపిఎమ్ పోతుల వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, రొట్టెలు అందజేశారు. తొలుత మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాయం కావేరి, శేఖర్బాబు, అదనపు డిఎమ్హెచ్ఒ, సిహెచ్వి.భరత లక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.కరుణేంద్రకుమారి, ఎమ్పిహెచ్ఒ సిహెచ్.గోపాల కృష్ణ, డిఎమ్ఒలు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జిల్లా పేరా మెడికల్ అధికారులు, ఆరోగ్య సబ్బంది, పాల్గొన్నారు. **మామిడికుదురు** నగరం, లూటుకుర్రు పిహెచ్సిల పరిధిలో అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని నగరం పిహెచ్ సి వైద్యాధికారి కెజె.ప్రశాంత్ అన్నారు. నగరం పిహెచ్సిలో మంగళవారం ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి నిర్మూలనకు చర్యలు చేపడతామని అన్నారు. **ముమ్మిడివరం** కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా అరికట్టవచ్చునని నగర పంచాయతీ చైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమార్ అన్నారు. ముమ్మిడివరం కుష్టు వ్యాధి నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నందు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధిరి యోగిత లక్ష్మి అధ్యక్షతన . అవగాహన ర్యాలీని చైర్మన్ ప్రవీణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యోగిత లక్ష్మి మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ఎంత తొందరగా గుర్తిస్తే అంత తొందరగా నయం చేయవచ్చున్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జి.లోవ రాజు, ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్, ఫార్మసిస్ట్ సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఉప్పలగుప్తం పి హెచ్ సి వైద్యాధికారి ఎల్. నాగార్జున ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు.గొల్లవిల్లి సచివాలయంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివక్షను ముగిద్దాం గౌరవాన్ని స్వాగతిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. అలాగే భీమనపల్లి, ఎస్.యానాం పిహెచ్సిల ఆధ్వర్యంలో కూడా అవగాహన సదస్సులు నిర్వహించారు.


కాలేరులో వ్యాధిగ్రస్తునికి దుప్పట్లు, బ్రెడ్ పంపిణీ


గొల్లవిల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ శ్రీ దుర్గ,వైద్యాధికారి నాగార్జున

ప్రతిభావంతులను గుర్తించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

ఎంఎల్ఎ పొన్నాడ సతీష్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా కారులను గుర్తించి, వారి ప్రతిభా పాటవాలను వెలికితీయడమే ఆడుదాం ఆంధ్రా ఇది అందరి అట ముఖ్య ఉద్దేశ్యం అని ముమ్మిడివరం శాసన సభ్యుడు పొన్నాడ సతీష్ కుమార్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డా.బి.ఆర్.అంభేద్కర్ కన్వెన్షన్ హల్ నందు మంగళవారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపికైన విజేతలకు ఆయన హుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ క్రీడాకారుల నుద్దేశించి మాట్లాడుతూ ఎంతో మంది ప్రతిభ ఉండి క్రీడలకు దూరం అవుతున్నారని, అటు వంటి వారిని ప్రోత్సహించడం ద్వారా వారి నైపుణ్యాలను గుర్తించేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు.ఈ పోటీల్లో భాగంగా నియోజకవర్గం స్థాయి షెటిల్ పోటీల్లో ముమ్మిడివరం మండలానికి చెందిన నలమాటి శివ, పెయ్యల నాని బాబు టీం తాళ్ళ రేవు టీంపై విజయం సాధించింది. విజేతలకు ప్రశంసాపత్రం మరియు షీల్డ్ అందించారు. **రామచంద్రపురరం** క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆడదాం ఆంధ్రా సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని అన్నారు.ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమంలో క్రికెట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన తోటపేట టీమ్కు ట్రోఫీ అందజేశారు. అదేవిధంగా వాలీబాల్ గేమ్ లో నియోజక వర్గ స్థాయిలో హసన్ బాద వాలీబాల్ క్రీడాకారులు ద్వితీయ స్థాయిలో విజయం సాధించిన సందర్భంగా రామచంద్రపురం ఆర్డిఒ కార్యాలయం వద్ద బహుమతి ప్రదానం చేశారు. ఆర్డిఒ సుధాసాగర్, రామచంద్రపురం వైసిపి ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్, జెడ్పిటిసి సభ్యులు వనుం సుబ్బారావు, కౌన్సిలర్ కొలమూరు శివాజీ, ద్రాక్షారామ సర్పంచ్, కొత్తపల్లి అరుణ, హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, అధికారులు క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ముమ్మిడివరం ఎంఎల్ఎ సతీష్

ఎంపిడిఒ కీర్తి స్పందనకు సన్మానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

సాధణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి వద్ద కసింకోట మండలానికి బదిలీ అయిన ఎంపిడిఒ ఎన్. కీర్తిసుందనను మంగళవారం ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమెల్లి సతీష్ కుమారి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వేలం పాలెం సర్పంచ్ టేకుమూడి సుజాత, హసన్ బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, లైన్ ఇన్స్పెక్టర్ ఎల్లమిల్లి రవికుమార్, మండలఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి, ఎంఇఒ మానుపూడి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎఇ యేసురత్నం, ఈఓపిఆర్డి ఎన్. సెలట్ రాజు, ఏఓ చాగంటి సుబ్రహ్మణ్యం, కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.


ఎంపిడిఒను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీను కుటుంబానికి అండగా 'ఎపిసిఆర్'

ప్రజాశక్తి - ఆలమూరు

అయిదేళ్లగా జైల్లోనే మగ్గుతున్న జనిపల్లి శ్రీను కుటుంబానికి అండగా నిలిచి అసోసియేషన్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్(ఎపిసిఆర్) ఆదుకుంటుందని ఆలమూరు బార్ అసోసియేషన్ ట్రెజరర్, ఎపిసిఆర్ సెక్రటరీ, న్యాయవాది బూసి విద్యా ప్రసన్న అన్నారు. మంగళవారం ఆమె విజయవాడలో శ్రీను కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రసన్న మాట్లాడుతూ ఈ కేసును మొదటి నుంచి అడ్వకేట్ సలీమ్ వాదిస్తుండగా, నాలుగు నెలలుగా ఎపిసిఆర్ సహకరిస్తున్నట్లు ఎపిసిఆర్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పిచ్చుకల శ్రీనివాసు తెలిపారని అన్నారు. అలాగే ఎపిసిఆర్ దేశంలో 18 రాష్ట్రాల్లో పని చేస్తోందని, ఈ కేసు విషయంలో ఆర్గమెంట్స్ పూర్తయ్యాయని ఫిబ్రవరి మొదటి వారంలో జనిపల్లి శ్రీనివాసు విడుదలయ్యే అవకాశం ఉందని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించామన్నారు.


శ్రీను కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న లాయర్ ప్రసన్న

మండల 'శాలివాహన' సంఘం ఎన్నిక

ప్రజాశక్తి - ఆలమూరు

మండల శాలివాహన కుమ్మరి సంఘం ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షులుగా ఆలమూరుకు చెందిన మల్లవరపు మల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షులుగా పెనికేరుకు చెందిన పేరూరి త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా పెనికేరుకు చెందిన పేరూరిరాజు, మోదుకూరుకు చెందిన పుల్లేటికుర్తి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా చింతలూరుకు చెందిన పసలపూడి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా గుమ్మిలేరుకు చెందిన పాండ్రాకుల సత్తిబాబు, పినపళ్లకు చెందిన పాండ్రాకుల కాశీ కృష్ణ, కోశాధికారిగా చొప్పెళ్లకు చెందిన పాలకొల్లు పట్టాభి రామయ్య, ఆర్గనైజర్గా ఆలమూరుకు చెందిన పాండ్రాకుల అమర్నాథ్, సభ్యులు ఎన్నిక య్యారు. జిల్లా శాలివాహన కుమ్మరి సంఘ అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం తదితరుల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.


శాలివాహన నూతన సంఘ సభ్యులు

సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-మండపేట

సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట, రాయవరం మండలాలలోని క్లస్టర్ సమావేశాలలో ఆయన మాట్లాడుతూ టిడిపినాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి మహాశక్తి పథకాలు తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, దీపం పథకం ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు, ఇంటింటికీ మంచినీరు పథకం, మహిళలకు ఉచిత బస్సు, యువగళంతో నిధి, నిరుద్యోగ భతి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

నేటి నుంచి కాటన్ బ్యారేజీ పై రాకపోకలు నిలుపుదల

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ రోడ్డు అభివద్ధి పనుల్లో భాగంగా నేటి నుంచి పది రోజులు పాటు వాహనాలు రాకపోకలను నిలుపుదల చేస్తు న్నట్లు గోదావరి హెడ్ వర్క్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కాశీ విశ్వేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు సహకరించాలని అన్నారు.

ప్రత్యేక హోదా కోసం వినతి

ప్రజాశక్తి -మామిడికుదురు

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆమ్మ -ఆద్మీ పార్టీ నాయకులు మామిడ కుదురు సెంటర్ లో మంగళ వారం ధర్నా నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ నల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహశీల్దార్కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో పార్టీ నేతలు పాల్గొన్నారు